సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సిరులతల్లికి తులసీదళార్చన


అమ్మవారిని అర్చిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణాభరణ అలంకరణలో సిరులతల్లి..
విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కనక మహాలక్ష్మి అమ్మవారు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వర్ణకవచాలంకరణలో దర్శనమివ్వనున్నారని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. భక్తులకు గర్భాలయ ప్రవేశానికి అవకాశం లేదని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి అనివేటి మండపంలో పంచాంగ పఠనం ఉంటుందని తెలిపారు.

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావుకు ఘన నివాళి


డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలువురు వైద్యులు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలో శనివారం 'డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు మెమోరియల్ ఓరియంటేషన్ ఇన్ ఆంకాలజీ' కార్యక్రమం నిర్వహించారు. తొలుత డాక్టర్ సుబ్బారావు చిత్రపటానికి ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు రఘునాథరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప తదితరులు ప్రసంగించారు. ఏఎంసీ పూర్వ విద్యార్థులు, ప్రవాసాంధ్రులు డాక్టర్ రవిశర్మ, శేషు శర్మ, డాక్టర్ లీల, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


ఆశ్రమ వాసులకు చీరలు అందజేస్తున్న బాబ్జీ

దాబాగార్డెన్స్: రంజాన్ పండగను పురస్కరించుకుని ప్రముఖ సంఘ సేవకుడు యాసీన్ బాబ్జీ శనివారం స్వామి వివేకానంద ఆశ్రమంలో గల ఆశ్రమ వాసులకు చీరలు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం రంజాన్ పండగ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాబ్జీ తెలిపారు. సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్న బాబ్జీకి సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు పోటెత్తిన భక్తులు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: కొత్త అమవాస్య సందర్భంగా అల్లిపురం, కొబ్బరితోట, నేతాజీనగర్, రామకృష్ణ జంక్షన్, ఏడుగుళ్ల స్లమ్‌లో గల నూకాంబిక అమ్మవారి దేవాలయాల వద్ద శనివారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం మాలధారులు అగ్నిగుండాలు తొక్కారు. డప్పు వాయిద్యాలు, తప్పిటగుళ్లు, సాము గరిడీల మధ్య అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

- కెప్టెన్ రామారావు జంక్షన్, సింహాలదేవిడి వద్ద మూత లేని మ్యాన్‌హోల్స్‌తో భయం భయం
- సాయిబాబా గుడి వీధిలో రోజూ జారి పడుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని జీవీఎంసీ సిబ్బంది

మ్యాన్‌హోల్స్ ఇలా.. రాకపోకలెలా?


34వ వార్డు రేణుక యల్లమ్మ ఆలయం వద్ద రోడ్డు మధ్యలో తెరుచుకున్న కల్వర్టుపై ఏర్పాటు చేసిన స్టాపర్


కల్వర్టు పైన తేలిన కంకర పిక్కలు


సింహాల దేవిడిలో తెరుచుకున్న కల్వర్టుపై ఏర్పాటు చేసిన పలక


సింహాలదేవిడిలో గొయ్యిపై ప్రమాదం జరగకుండా ఏర్పాటు చేసిన రాళ్లు


ప్రమాదకరంగా మారిన సాయి బాబా వీధిలోని బాబా గుడి వద్ద కల్వర్టు

అల్లిపురం: జీవీఎంసీ 32, 33, 34 వార్డుల పరిధిలో పలు చోట్ల తెరుచుకున్న మ్యాన్‌హోల్స్ ప్రమాదాలకు నెలవులుగా మారాయి. స్థానికులు వాటిపై హెచ్చరికగా ప్లాస్టిక్ బాక్సులు, ఇటుకలు, సిమెంట్ పలకలు పెట్టి ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జీవీఎంసీ సిబ్బంది వాటిని చూసీ చూడనట్లుగా వదిలేయటంపై పలువురు వాహన చోదకులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పడుతున్నా పట్టించుకోరా?

ప్రతిరోజు జారిపడుతున్నా పట్టించుకోరా అని వాహన చోదకులు జీవీఎంసీ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. మూడు నెలల రోజుల క్రితం సాయిబాబావీధి నుంచి గోవింద్‌రోడ్డుకు వచ్చే దారిలో జీవీఎంసీ కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మించారు. అయితే కాంట్రాక్టర్ కక్కుర్తో, అధికారుల చేతివాటమో తెలియదు గాని వాహన చోదకులకు అది శాపంగా మారింది. నిర్మించిన కల్వర్టు మూడు రోజులు కూడా కాకుండానే కంకర పిక్క తేలిపోయింది. కల్వర్టు ఎత్తు పెరగడం, రోడ్డు మలుపులో కల్వర్ట్ ఉండటంతో వాహనాలు తిరుగుతున్నప్పుడు వాహన చోదకులు జారి పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పత్రికలో ప్రచురించినా జీవీఎంసీ సిబ్బంది నుంచి ఎటువంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాద సూచికగా స్టాపర్ పెట్టాం..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ గుడి పక్క రోడ్డు మధ్యలో కాలువపై పలక విరిగిపోయింది. ఆ స్థానంలో కొత్తది వేయాలని జీవీఎంసీ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదు. నెల రోజులుగా ఇదే పరిస్థితి. ప్రమాదసూచికగా స్టాపర్ పెట్టాం. వాహన చోదకులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది తక్షణమే చర్యలు తీసుకోవాలి.
– బొడ్డు పోలారావు, కెప్టెన్ రామారావు జంక్షన్

ఎవరో ఒకరు పడుతూనే ఉన్నారు..

సింహాలదేవిడి రోడ్డు మలుపులో కాలువలపై పలకలు పైకి లేచి ఉండటంతో ఎవరో ఒకరు పడుతూనే ఉన్నారు. పాదచారులు కూడా తన్నుకుని పడిపోతున్నారు. చీకటి పడితే మరీ ప్రమాదకరంగా ఉంది. మలుపులో ఉండటం వల్ల పైకి లేచి కాలువ పలకను ఎవరూ గుర్తించలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పలక మార్పించాలి.
– పి.అప్పారావు, సింహాలదేవిడి

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

గత జనవరిలో సాయిబాబా వీధికి వెళ్లే మలుపులో పాత కల్వర్టు శిథిలమటంతో కొత్తది నిర్మించారు. అది రెండు రోజులకే కంకర తేలిపోయింది. ముఖ్యంగా వాహనాలు మలుపు తిరిగే సమయంలో కంకర వల్ల జారి పడుతున్నారు. రోజుకు కనీసం ఇద్దరు, ముగ్గురు పడిపోతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.
– ఎన్.నాగేశ్వరరావు, గోవింద్ రోడ్డు

'విశాఖ ఉక్కుపై లేని శ్రద్ధ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకు?'

దాబాగార్డెన్స్: మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆరాటపడుతున్న కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు అభివృద్ధికి కృషి చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు 2200 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇనుప ఖనిజం, ముడిసరుకు అంతరాయం లేకుండా పైపుల ద్వారా సరఫరా చేయాలని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని నరేంద్ర మోదీని కోరారన్నారు. ఇదే శ్రద్ధ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకు లేదని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు లాభాల బాట పట్టేందుకు అవసరమైన చర్యలు కేంద్రం వెంటనే తీసుకునేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.

ఆది, సోమవారాల్లో ఆస్తి పన్ను చెల్లించవచ్చు

జగదాంబ: జీవీఎంసీ ఆస్తి పన్ను చెల్లింపులకు ఆది, సోమవారం కూడా సౌకర్యం సెంటర్లు అందుబాటులో ఉంటాయని జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు శనివారం తెలిపారు. ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం పన్ను రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండగల నేపథ్యంలో కూడా జోనల్ కార్యాలయానికి సెలవు లేదన్నారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు జీవీఎంసీ సౌకర్యం కేంద్రం తెరిచే ఉంటుందన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్ల బిల్లులు తక్షణం చెల్లించాలి


రొంగలి జగన్నాథం

అల్లిపురం: జీవీఎంసీ కాంట్రాక్టర్ల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రొంగలి జగన్నాథం డిమాండ్ చేశారు. జీవీఎంసీ కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లు బకాయి పడిందన్నారు. ఈఎండీలు, ఏఎస్‌డీలు సుమారు రూ.50 కోట్లు బకాయి ఉందన్నారు. దీంతో చిన్న కాంట్రాక్టర్లు వడ్డీలు కట్టలేక, ఇళ్లు, ఆస్తులు అమ్ముకుని రోడ్డున పడ్డారన్నారు. కాంట్రాక్టర్ల కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో వసూలైంది కాబట్టి కనీసం ఆరు నెలల బిల్లులైనా తక్షణమే చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పోతురాజు కుటుంబానికి వాసుపల్లి చేయూత


పోతుస్వామికి నివాళులర్పించి, కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు నొల్లు పోతురాజు (పోతుస్వామి) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పోతుస్వామి ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. మృతికి సంతాపం తెలిపారు. తక్షణ సాయం కింద రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. దీర్ఘకాలంగా వైఎస్సార్‌సీపీలో పనిచేస్తూ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గెలుపునకు పోతుస్వామి ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పార్టీ అభివృద్ధికి 37వ వార్డు అధ్యక్షుడిగా ఎనలేని సేవలందించారని కొనియాడారు. తాను నిర్వహించిన ప్రజాదర్బార్లకు వార్డు నుంచి ప్రజా సమస్యలు తనవిగా భావించి పరిష్కరించే వరకు వదిలేవాడు కాదని వాసుపల్లి తెలిపారు. ఇంత మంచి నాయకులు అరుదుగా ఉంటారన్నారు. పోతుస్వామి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వాసుపల్లి వెల్లడించారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు (పులి), పీతల వాసు, మైఖేల్‌రాజు, రెయ్యి డేవిడ్‌రాజు, తాడి రవితేజ, బెవర మహేష్, ఆకుల యేసు, రామరాజు, వాశెట్టి శ్యాం, బోని దేవా తదితరులు పాల్గొన్నారు.

కేసుల పేరుతో ఆటో డ్రైవర్లను వేధించొద్దు

- చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- జీవీఎంసీ గాంధీబొమ్మ వద్ద ఆటోడ్రైవర్ల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవరు

సీతమ్మధార: స్కూల్ ఆటోలపై పోలీసులు, రవాణాశాఖ అధికారులు పెడుతున్న కేసులు వెంటనే నిలిపివేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. కేసుల పేరుతో ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేయవద్దని కోరారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వందలాది మంది ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర రూ. 15 వేలు ఇస్తామని, జరిమానాల జీవో నంబర్ 21, 31ని రద్దు చేస్తామని, డ్రైవర్లకు వ్యక్తిగత బీమా పాలసీ రూ. 10 లక్షలు అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. 9 నెలలైనా ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కే. రెహమాన్, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్, అడ్డూరి శంకర్, యు. శివాజీ దేవుడు, ఈశ్వర్, చంటి, నాని, వేణు, వందలాది మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

సత్తివాడకు కవిబ్రహ్మ.. ఆణిముత్యం పురస్కారాలు


సత్కారం పొందుతున్న సత్తివాడ

దాబాగార్డెన్స్: ప్రతిభ సాంస్కృతిక, క్రీడా, స్వచ్ఛంద సేవా సంస్థ, మదర్ థెరీసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ప్రత్యేక ఉగాది వేడుకల్లో నగరానికి చెందిన ప్రముఖ కవి సత్తివాడ శ్రీకాంత్‌కు కవిబ్రహ్మ, ఆణిముత్యం ఉగాది జీవిత సాఫల్య పురస్కారాలు అందజేశాయి. సత్కారం కింద బంగారు మెడల్, జ్ఞాపికతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు కె. కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజాన్ని చైతన్య పరుస్తున్నందుకు సత్తివాడకు ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరంపూడి మాస్టర్, ఏయూ ప్రొఫెసర్ రాజు, మెడికవర్ వైద్యుడు డాక్టర్ శ్రీధర్, కోనేటి విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో


స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రజలు ఎనీమియా బారిన పడకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం స్వతంత్రనగర్, మురళీనగర్, భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన సందర్శించి సమీక్ష నిర్వహించారు. సీజనల్ కమ్యూనికబుల్ డీసీజెస్‌పై సిబ్బంది, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పథకాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం జరగాలని, లేకపోతే ప్రజలు ఇబ్బంది పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో తలెత్తిన విభేదాలు

- గ్రూపులుగా విడిపోయిన నాయకులు, కార్యకర్తలు


బంగారుమెట్టలో శనివారం సాయంత్రమైనా ఎగరని టీడీపీ జెండా

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో టీడీపీ జెండా ఎగరలేదు. వార్డులో నాయకులు, కార్యకర్తలు గ్రూపులుగా విడిపోవటంతో టీడీపీ వ్యవస్థాపక దినోత్సవంలో విభేదాలు బయటపడ్డాయి. శనివారం టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వార్డులో వెంకటేశ్వరమెట్టపై విల్లూరి డాక్టర్ చక్రవర్తి, బంగారుమెట్టలో బంటుపల్లి సూర్యనారాయణ, కుమ్మరవీధిలో భీమరశెట్టి వాసు, రమేష్ టీడీపీ జెండా ఎగరేసేందుకు ఆదరా బాదరా జెండా కర్రలు, గట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. వాటిలో వార్డు నాయకుల ఫొటోలు ఏర్పాటు చేయకపోవటంతో వారిలో విభేదాలు మొదలయ్యాయి. టీడీపీ దక్షిణ నియోజకవర్గం నాయకుడు సీతంరాజు సుధాకర్ వార్డులో నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో మూడు చోట్లకు రాక పోవటంతో కార్యక్రమాలు రద్దు చేసుకున్నారు. చీరలు, మజ్జిగ పంపిణీ చేయాలనుకున్నారు. అందుకోసం మహిళలు మధ్యాహ్నం 1 గంట వరకు వేచి ఉన్నారు. బంటుపల్లి సూర్యనారాయణ తన కార్యాలయం వద్ద, విల్లూరి డాక్టర్ చక్రవర్తి తన అపార్టుమెంటు వద్ద సాయంత్రం కేక్ కట్ చేసి మమ అనిపించారు. దీంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు బహిరంగంగానే వార్డు నాయకులపై విమర్శలు గుప్పిస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- గంజాయి బ్యాచ్ పనే అని అనుమానం


కాలి బూడిదైన ద్విచక్ర వాహనాలు

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి, సింగ్ హోటల్ జంక్షన్‌లో శనివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.8లక్షల విలువ గల 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. టూటౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌హోటల్ జంక్షన్‌లో గల ఒక గ్రూపు హౌస్‌లో శనివారం తెల్లవారు జాము 4.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. దీంతో స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవటంతో ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి కారణమైన వారు గంజాయి బ్యాచ్ కావచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఎంవీపీకాలనీ: ఫిషింగ్ హార్బర్‌కు చెందిన పిల్లా నూకమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పిల్లా పైడిరాజు(24) చేపల వేటకు వెళ్తుంటాడు. ఈ నెల 28న భీమిలిలో నూకాలమ్మ పండగ సందర్భంగా పైడిరాజు, అతడి స్నేహితుడు పిల్లా చంటితో కలిసి అక్కడికి వెళ్లాడు. రాత్రంతా సరదాగా గడిపి భీమిలి నుంచి బైక్‌పై వస్తుండగా.. 29వ తేదీ తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో వెంకోజీపాలెం ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో హైవేపై డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ సమయంలో చంటి వాహనం నడపుతుండగా పైడిరాజు వెనుక కూర్చున్నాడు. నిర్లక్ష్యంగా వాహనం నడపడం, అతివేగంగా కారణంగా డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పైడిరాజు అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రగాయాలైన చంటిని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనలో ఏపీ39 ఆర్‌జీ 5980 యమహా ఎంటీ బైక్ నుజ్జునుజ్జయ్యింది. ప్రస్తుతం చంటి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మహారాణిపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఒక హోటల్లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొలుత ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు రాములోరి పెళ్లి రాట


లక్ష్మణ హనుమత్ సమేత సీతారాములు

దాబాగార్డెన్స్: మహారాణిపేటలో వెలసిన అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీరామచంద్రమూర్తి పెళ్లి రాట వేయనున్నారు. అలాగే స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయనున్నారు. వచ్చే నెల 6వ తేదీన అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణం జరగనుందని, కల్యాణంలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 కల్యాణ రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఈవో కె. శోభారాణి తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 గంటలకు ఉత్సవమూర్తులకు నిర్వహించే పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ. 516 చెల్లించాలని ఈవో శోభారాణి తెలియజేశారు.

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు
SRINIVASA Caterers
Proprietors G.Srinivasarao 9393126627 G.Govindh 9885296028
22-37-1/1 Chengal Rao Peta, Near Gosha Hospital, Visakhapatnam-530001
E-mail: gundagovind4@gmail.com

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు
అధికారులకు, ఉద్యోగులకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు, మరియు సిబ్బందికి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు.
G.V.M.C. అధికారులు మరియు సిబ్బంది
జోన్-3, విశాఖపట్నం

ఉగాది శుభాకాంక్షలు
Mrs. A.V.N. COLLEGE
Sri A.V. Narasinga Rao Founder & Scientist
HIGH SCHOOL: 6th to 10th Class (Mid day meals will be provided)
INTERMEDIATE: C.E.C, HEC, MEC, MPC, Bi.PC (Telugu & English Medium)
POLYTECHNIC: DCE, DEEE, DME, DECE, DCME
VOCATIONAL : ✦ MLT ✦ MPHW (F)
DEGREE
B.A. Honour (Economics) | B.B.A. Honours | B.Sc. Honours (Physics)
B.A. Honour (Political Science) | B.Sc. Honours (Botany) | B.Sc. Honours (Comp. Science)
B.A. Honour (Tourism & Travel) | B.Sc. Honours (Zoology) | B.Sc. Honours (Statistics)
B.A. Honour (Special Telugu) | B.Sc. Honours (Data Science) | B.Sc. Honours (Electronics)
B.Com. Honour (Comp. Application) | B.Sc. Honours (Chemistry) | B.C.A. Honours
B.Com. Honour (General) | B.Sc. Honours (Mathematics)
Behind KGH, Near Poorna Market, Visakhapatnam - 530 001
Cont : 80968 65327, 86885 68142, 80086 30918